ఉద్యాన పంటలను ప్రోత్సహించాలి

ఆసిఫాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యాన, వాణిజ్య పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని కమిషన్ ఆఫ్ హార్టికల్చర్ జిల్లా ప్రత్యేకాధికారి అజ్మీర ప్రేమ్‌సింగ్ అన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎండీ అబ్దుల్ నదీం, కాగజ్‌నగర్ ఉద్యానవన అధికారి సుప్రజ, మ్యాట్రిక్స్ కంపెనీ సీఈఓ ఉదయ్‌కుమార్, ఇతర అధికారులతో కలిసి జిల్లా కేంద్రంలోని ఉద్యానవన శాఖ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన, వాణిజ్య పంటలను సాగుచేసేలా సాగు విధి విధానాలపై రైతుల అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో దీర్ఘకాలిక పండ్ల తోటలైన మామిడి, జామ, తదితర పండలు, ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి ప్రభుత్వం తరపున రాయితీలు అందిస్తుందని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యా వ్యవస్థ బలోపేతమే ధ్యేయం

వాంకిడి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతమే ధ్యేయంగా చర్యలు తీసుకుంటుందని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. వాంకిడి మండలం బెండార గ్రామంలో గల మండల పరిషత్ పాఠశాలను గురువారం సందర్శించి మధ్యాహ్న భోజనం, వంట శాల, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అనేక చర్యలను చేపడుతుందని ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా వెనకబడిన విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించాలని తెలిపారు. సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అకాడమీ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, ఎంఈవో శివచరణ్ పాల్గొన్నారు.

ఆసరాపై ఆడిట్

- అనర్హుల గుట్టురట్టుకు ప్రభుత్వ నిర్ణయం
- మార్గదర్శకాల రూపకల్పనలో ఉన్నతాధికారులు
- పంపిణీల్లోనూ అవకతవకలపై ఫిర్యాదులు
- అర్హులకు లబ్ధి చేకూరేలా చర్యలు
- జిల్లాలో 54 వేల మంది పింఛన్‌దారులు



చింతలమానేపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్ల ఆడిట్(సామాజిక తనిఖీ) నిర్వహించాలని నిర్ణయించింది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టే పనుల్లో అవకతవకలు, అక్రమాల గుట్టు రట్టు చేసేందుకు మండలాల వారీగా సామాజిక తనిఖీ నిర్వహించి అక్రమాలకు పాల్పడిన వారి నుంచి సొమ్ము రికవరీ చేస్తున్నారు. అదే మాదిరిగా ఆసరా పెన్షన్లపై కూడా సామాజిక తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అవకతవకలను గుర్తించి అక్రమార్కులను తొలగించాలని నిర్ణయించింది.

అనర్హులకు అందకుండా..

ఆసరా పెన్షన్లు అనర్హులకు అందుతున్నాయనే ఆరోపణలు నిత్యం వింటూనే ఉంటాం. అలాంటి వారిని గుర్తించి పెన్షన్లు తొలగించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సామాజిక తనిఖీ చేపడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 54,589 మంది ఆసరా పింఛన్ లబ్ధిదా రులున్నారు. వీరిలో వృద్ధాప్య పింఛన్ పొందేవారు 23,253 మంది, ఒంటరి, వితంతువులు 21,612 మంది, దివ్యాంగులు 5,858 గీత కార్మికులు 133 మంది ఉన్నారు. వీరికి నెల నెలా రూ. 12,76,65,936 రాష్ట్ర ప్రభుత్వం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా పోస్టల్ శాఖకు అందజేస్తున్నది. బ్రాంచ్ పోస్టు మాస్టర్ల ద్వారా లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతీ నెల ఆసరా పెన్షన్లపై సామాజిక తనిఖీ నిర్వహిస్తే అనర్హులు, అవకతవకలకు పాల్పడే వారి గుట్టు రట్టయ్యే అవకాశం ఉన్నదని చెబుతున్నారు. కొన్ని సంవ త్సరాలుగా అనర్హులు కొందరు పింఛన్లు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారిలో అనర్హులు ఉన్నారనే ప్రచారం ఉంది. తనిఖీ నిర్వహిస్తే ఇలాంటి అవకతవకలన్నీ బయట పడే అవకాశం ఉన్నది.



తపాలా శాఖ ద్వారా..

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో తపాలాశాఖ ద్వారా పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. పంపిణీదారులు మాత్రం వేలి ముద్రలు తీసుకొని పింఛన్లు అందజేస్తున్నారు. వేలి ముద్రలు పడకపోతే ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వేలి ముద్రతో అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ పంపిణీలో కూడా పలు చోట్ల అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చినట్లు సమాచారం.

ఈ నేపథ్యంలో అవకతవకలు, అక్రమాలను గుర్తించేం దుకు ఆసరా పింఛన్లపై సామాజిక తనిఖీ నిర్వహించడమే మార్గ మని భావించిన ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసు కుంటోంది. ఆసరా పింఛన్లపై సామాజిక తనిఖీ నిర్వ హించేందుకు అవసరమైన మార్గదర్శకాలు రూపొందించే పనిలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. విధి విధానాల రూప కల్పన పూర్తి కాగానే సామాజిక తనిఖీలకు సంబంధించి షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్నది. కొందరు వృద్ధులు తమ వేలి ముద్ర పడకపోయినా ఆయా పంచాయతీ కార్యదర్శి వేలిముద్ర సహాయంతో వారికి పింఛను అందజేస్తారు.

కానీ ఈ సామాజిక తనిఖీ అని తెలుసుకున్న అధికారులు వృద్ధుల వేళ్ల పడని వారిని గుర్తించి వారిని ఆధార్ అప్‌డేట్ చేసుకో వాలని చెబుతున్నారు. మీ వేలి ముద్రతోనే పింఛన్లు అందజేస్తామని లేకుంటే లేదని తేల్చి చెబుతున్నారు. దీంతో వేలి ముద్ర పడని వృద్ధులు తమ ఆధార్ అప్‌డేట్ చేసుకోవడంతో పాటు వేలి ముద్రలు పడేలా చూసుకుంటున్నారు.

నిరాధారమైన ఆరోపణలు మానుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీ గెడం నగేష్

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రంపై జీవో 49 విషయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు చేస్తున్న నిరాదారణమైన ఆరోపణలు మానుకోవాలని ఎంపీ నగేష్ అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో 49 విషయంలో కేంద్రానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. 2014లో కాంగ్రెస్ ప్రభ్తువం అధికారంలో ఉందన్నారు. బెజ్జూరు రేంజ్ పరిధిలో రాంబదులు ఉన్నాయని వాటిని కాపాడుకోవాలని 2014లో నివేదికను అప్పటి ఉమ్మడి ఆదిలాబాద్ సీఎఫ్‌కు పంపించామని అన్నారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గత జూన్ మాసంలో జీవో 49 తెచ్చిందన్నారు. ఇటీవల జిల్లాకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు సైతం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు జీవో .49 రద్దు చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం ఇటీవల ఎన్నికైన డివిజన్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, శ్రీనివాసరావు, సాయి, సదాశివులను ఎంపీ, బీజేపీ నాయకులు సన్మానించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు విజయ్, మల్లికార్జున్, మురళీ, సొల్లు లక్ష్మి, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి

సిర్పూర్(యు), జూలై 10 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం వల్ల ప్రాణ దానం చేసిన వారమవుతాయని, యువత ముందుకు రావాలని మార్కెట్ కకమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆత్రం మాన్విత్‌శ్రీ ఫౌండేషన్ అధ్వర్యంలో ఆదివాసీ నాయకుడు మాజీ మండల అధ్యక్షుడు ఆత్రం భగవంత్‌రావు జన్మదినం సందర్భంగా భాగంగా రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 70 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆత్రం భగవంత్‌రావుతోపాటు ఎస్‌బీఐ మేనేజర్ ఆత్రం సునిల్ కుమార్, ఫౌండేషన్ నిర్వాహకులు ఆత్రం ఓంప్రకాష్, పీఏసీ చైర్మన్ కేంద్రె శివాజీ, లింగాపూర్ మాజీ జడ్పీటీసీ లాక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆత్రం భగవంత్‌రావు కేక్ కట్ చేశారు.

శిథిలావస్థలో ఉన్న ఇళ్లు కూల్చివేత


ప్రమాదకరమైన ఇళ్లను కూల్చివేస్తున్న అధికారులు

కాగజ్‌నగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ సర్‌సిల్క్ ఏరియాలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గురువారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్, టీపీఎస్ యశ్వంత్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదకరమైన ఇళ్లకు ముందస్తుగా నోటీసులు అందజేశామని చెప్పారు. అనంతరమే కూల్చివేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీపీబీవోలు రాహుల్, హరికృష్ణ, ప్రీతం పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ ఇతరులకు మార్గదర్శకులుగా నిలువాలని సీఐ రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు గురువారం డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సతీష్, భరోసా టీం ఎస్సై తిరుమల, షీ టీం సిబ్బంది స్వప్న, కళాశాల నిర్వహ కులు సాయిని రాజశేఖర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు న్యాయం చేయడం లేదని
రైతు ఆత్మహత్యాయత్నం

కాగజ్‌నగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం సార్సాల గ్రామానికి చెందిన రైతు పాముల శ్రీనివాస్ (40) అనే రైతు గురువారం భూవివాదంలో పోలీసులు న్యాయం చేయ డం లేదని, ఎస్పీగారు మీరే స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటూ పురుగుల మందు తాగుతూ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. విషయం తెలుసుకుంటున్న కుటుంబ సభ్యులు వెంటనే కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంద ర్భంగా కుటుంబ సభ్యులు పలువురు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన లింగయ్య కుటుంబ సభ్యులతో ప్రాణహాని ఉందని ఈసు గాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చిన కూడా పోలీసులు పట్టించుకోకుండా తమపై కేసులు నమోదు చేశారని వాపోయారు. దీంతో మనస్తాపానికి గురై శ్రీనివాస్ ఆత్మహత్యా యత్నం చేశాడని అన్నారు. ఈ విషయమై డీఎస్పీ రామానుజంను వివరణ కోరగా శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నం సంఘటనపై సమగ్రంగా విచారణ చేపడుతామని తెలిపారు.


పురుగుల మందు డబ్బాతో శ్రీనివాస్

ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల భాష అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీట్రెసీ ప్రోగ్రాం వన్ డే ఓరియంటేషన్ విథ లీఫ్ ఫార్వర్డ్ ఆధ్వర్యంలో గురువారం ఆశ్రమ పాఠశాలలో ప్రాథమిక స్థాయి ఆంగ్ల ఉపాధ్యాయులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. పీవో ఆదేశాల మేరకు ఆశ్రమ పాఠశాలలో మూడు నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆంగ్ల భాషలో సామర్థ్యం పెంపు మంచి ప్రవీణ్యం కోసం శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్దవ్, ఏటీడీవో చిరంజీవి, ఏసీఎంవో జగదీష్, ఏటీడీవో శ్రీనివాస్, డీఎస్‌వో మీనారెడ్డి, లీఫ్ ఫార్వర్డ్ సంస్థ ప్రతినిధులు లక్ష్మణ్‌రావు, ప్రశాంత్, సునీత, రవళి, రమేష్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. మండలంలో 26.6 మిల్లీలీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఆడ బీర్షావ్ తెలిపారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో పశువైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం పశువులకు నట్టల నివారణ, జబ్బు వాపు, గొంతువాపు ఇతరాత్ర వ్యాక్సినేషన్ చేశారు. గోయగాం, అనార్‌పల్లి గ్రామాల్లో పశువైద్య సబ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థు కోరారు.

కెరమెరి,(ఆంధ్రజ్యోతి): జోడేఘాట్‌లో భీం స్మృతి వనంలో భీం వారసులు అకాడి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భీం మనుమడు సోనేరావు, గ్రామ పటేల్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బుద్ధుడి బోధనలు అనుసరించాలని భంతే భరద్వాజ్ సూచించారు. మండల కేంద్రంలోని జపాన్ బుద్ధ విహార్‌లో బుద్ధ అండ్ ధమ్మ గ్రంథ పఠన(వర్షవాస్) కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పీఆర్సీ వెంటనే అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షు రాలు వైద్య శాంతికుమారి తెలిపారు. మండల కేంద్రంలోని పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): గుడ్లబోరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం పంచాయతీ పరిధిలోని వైగాం, సైదాపూర్, విజయనగరం, మరియపురం, గుడ్లబోరి గ్రామాల మహిళలు, ప్రజలు సమావేశమై గ్రామాల్లో సంపూర్ణ మద్యపాన నిషేధించాలని తీర్మానించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి తీర్మాన పత్రం అందేశారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ప్రాజెక్టు గేటు ఎత్తివేయడంతో పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుందని పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విక్రమ్ సూచించారు. ఏదైనా సమస్య వస్తే వెంటనే 8712670537కు సమాచారం అందించాలని సూచించారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు


చింతలమానేపల్లిలో హోమంలో పాల్గొన్న భక్తులు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురుపౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సాయిబాబా ఆలయంలో అర్చకులు మధుకర్‌శర్మ, సాయిల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గత వారం రోజుల నుంచి ఆలయంలో గురుచరిత్ర పారాయణం నిర్వహించారు. సాయంత్రం పల్లకిసేవ నిర్వహించారు. సరస్వతి శిశు మందిర్‌లో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. వ్యాసమహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుపౌర్ణమి విశిష్ఠతను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోటేశ్వర్, ఉపాధ్యాయులు శారద, అమరావతి, సత్యనారయణ, శ్రీకాంత్, పాఠశాల కమిటీ సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. అన్నీ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రబంధకారిని అధ్యక్షులు చిలువేరు ప్రవీణ్, కార్యదర్శి కొడిపాక సత్యనారాయణ, రిటైర్డు ఎంఈఓ వినోద్, భవానీ, రోజా, ధనలక్ష్మి, శ్రావణి, లావణ్య, ఊర్మిళ, సాగర్, శ్రావణి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలో శ్రీ దేవానంద స్వామి ఆశ్రమంలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురు పాదుకలకు పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాగజ్‌నగర్ టౌన్, (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురుపూర్ణిమ సందర్భంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయగా జీ.ఎం ఎం ఎస్ గిరి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, సేవా సమితి భక్తులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల హన్మన్-సాయిబాబా ఆలయంలో ఉదయం నుంచే భక్తులు గురు పౌర్ణిమ పూజలు నిర్వహించారు. జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాధ్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, నాయకులు తోడసం ధర్మరావు, మాజీ సర్పంచ్ ఆర్క నాగోరావు, అనిల్‌కుమార్ సాయిబాబా ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. మహగాంలో సంత్ సురోజీ బాబా శిష్యులు పూజలు చేశారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జవెల్లి గ్రామంలో ఓంకార ఆశ్రమం, రాధాకృష్ణ మందిరంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. మహాభారత రచయిత మహర్షి వేద వ్యాసుని జన్మదినోత్సవం సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు.

కౌటాల,(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురువారం గురు పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో భక్తులు కనకయ్య, సత్తయ్య, శైలేష్, వినాయక్‌గౌడ్, ఉమేష్‌గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక మార్గం అనుసరించాలి



మాట్లాడుతున్న బాబా తనయుడు ఇంగ్లే కేశవ్‌రావ్

జైనూర్/లింగాపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి: పరమహంస సద్గురు పూలాజీబాబా చూపించిన ఆధ్యాత్మిక మార్గం ప్రతి ఒక్కరూ అనుసరించాలని బాబా తనయుడు ఇంగ్లే కేశవ్‌రావ్ కోరారు. మండలంలోని పట్నాపూర్ సిద్ధేశ్వర్ సంస్థాన్‌లో గురువారం నిర్వహించిన గురు పౌర్ణమి వేడుకల్లో ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. గురు పౌర్ణమి కేవలం పండుగ కాదని, ఇది సభ్య సమాజాన్ని ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించే ముఖ్యమైన కార్యక్రమమని తెలిపారు. అనంతరం బాబా సమాధి మందిరంలో ప్రత్యేక హారతి, పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సీఐ రమేష్ ఆధ్వర్యంలో ఎస్సై రవికుమార్ భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నాందేవ్‌ససానె, అంధ్ సమాజం జిల్లా అధ్యక్షుడు ముఖాడె విష్ణు, ఆదిలాబాద్ బెటాలియన్ డీఎస్పీ రఘునాథ్, పంస్థాన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇంగ్లే వామన్‌రావ్, కమిటీ సభ్యులు మాగాడె దాదారావ్, గుర్నులె సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కెరమెరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోడి గ్రామంలో కేజీబీవీ పాఠశాలలో కుక్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థి కనీసం ఏడో తరగతి చదివి ఉండాలని పేర్కొన్నారు. 18-45 వయస్సు కలిగి ఉండాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 15వ తేదీ టలోగా ఎంఈవోఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్-1, స్కావేంజర్-1 పోస్టులకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 16లోగా ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సదా మీ సేవలో ఆంధ్రజ్యోతి
అ చిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి
చందాదారులు గా చేరాలనుకుంటున్నారా!
అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితె చాలు
మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు.
పత్రిక పంపిణిలో మీకు ఏమైనా అసౌకర్యం
ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు
మా సిబ్బంది సదా మీ సేవకు సిద్దంగా ఉంటారు
మంచిర్యాల : 94929 68431
బెల్లంపల్లి : 77806 58811
కుమ్రంభీం ఆసిఫాబాద్ : 84639 54674
C.O : 99854 11276
ఇట్లు : బ్రాంచ్ మేనేజర్



బెజ్జూరులో ప్రాణహిత బ్యాక్ వాటర్‌లో నీట మునిగిన పంటలు



కౌటాలలో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత వరదలో నీట మునిగిన పుష్కరఘాట్‌లు



బెజ్జూరు మండలం తలాయి రోడ్డుపై చేరిన ప్రాణహిత నీరు



సిర్పూర్(టి)లో వంతెనను అనుకుని ప్రవహిస్తున్న పెన్‌గంగా నది

ఉప్పొంగిన ప్రాణహిత

- తలాయి, పాత సోమిని మధ్య నీట మునిగిన వంతెన
- పంట చేలలోకి చేరిన వరదనీరు

బెజ్జూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత నదికి వరద పోటెత్తింది. మండల సరిహద్దులో ప్రవహిస్తున్న ప్రాణహిత నది ఉప్పొంగడంతో తీర ప్రాంతాల్లోని రైతులు సాగు చేసిన పత్తి పంట వందలాది ఎకరాల్లో నీట మునిగింది. మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తోడు అక్కడే ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో ప్రాణహిత నదికి వరద నీరు భారీగా పోటెత్తింది. దీంతో ప్రాణహిత బ్యాక్ వాటర్ పంట చేలలో చేరడంతో రైతులు సాగు చేసిన పత్తి పంట నీట మునిగింది. వరద ఉధృతికి తలాయి, పాత సోమిని గ్రామాల మధ్య వంతెన నీట మునగడంతో రాక పోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తలాయి-పాపన్నపేట గ్రామాల మధ్య ప్రధాన రోడ్డుపై ప్రాణహిత బ్యాక్ వాటర్ పారుతుండడంతో రాక పోకలకు ఆటంకం ఏర్పడింది. కుశ్నపల్లి, సోమిని గ్రామాల మధ్య లోలెవల్ వంతెన పై నుంచి భారీగా వరద నీరు పారుతుండడంతో రాకపోకలు స్తంభించి పోయాయి. దీంతో వాగు అవతలి వైపు ఉన్నసుస్మీర్, సోమిని, మొగవెల్లి, ఇప్పలగూడ, పాత సోమిని, గర్రెగూడ, నాగేపల్లి, తలాయి, తిక్కపల్లి, భీమారం మొత్తం 11గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ప్రాణహిత తీర ప్రాంతాల్లో రైతులు సాగుచేసిన పత్తిపంట నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పాపన్నపేట, తలాయి తీర ప్రాంతాల్లో నీట మునిగిన పంటలను వ్యవసాయాధికారి నాగరాజు పరిశీలించారు. సుమారు పదిహేను వందల ఎకరాల్లో పత్తి పంట నీట మునిగినట్లు అధికారులు అంచనా వేశారు.

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలంలో కురిసిన వర్షానికి బూర్గుడ గ్రామంలోని పలు కాలనీల్లోకి వరదనీరు భారీగా వచ్చి చేరింది. కుమరంభీం ప్రాజెక్టు రెండు గేట్లు పైకి ఎత్తి నీటికి అధికారులు కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి 850 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో రెండు గేట్లు ఎత్తి 880 క్యూసెక్కుల వరదనీటిని బయటకు వదులుతున్నారు.

కౌటాల: కౌటాల మండలం తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత పుష్కరఘాట్ పూర్తిగా మునిగి పోయింది. ఎగువ మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు ప్రాణహితలో నీటిమట్టం పెరిగింది. బుధవారం సగం పుష్కర ఘాట్ మెట్లు మునిగి పోగా గురువారం నాటికి పూర్తిగా పుష్కరఘాట్ మెట్లు మునిగి పోయాయి.

చింతలమానేపల్లి: చింతలమానేపల్లి మండలం గూడెం వద్ద మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు వరద నీరు రావడంతో ప్రాణహితనది పరవళ్లు తొక్కు తోంది. నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రత్తంగా ఉండాలని పోలీసులు, రెవెన్యూశాఖల అధికారులు హెచ్చరిస్తున్నారు.

సిర్పూర్(టి): మండలంలోని వెంకట్రావుపేట, పోడ్సా వంతెనను ఆనుకుని పెన్‌గంగా నది ప్రవహిస్తుంది. నదిపరివాహక ప్రాంతాలైన హుడ్కిలి, మాకిడి, జక్కాపూర్, లోనవెల్లి, వెంకట్రావుపేట, లక్ష్మీపూర్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరు కూడా చేపల వేటకు వెళ్లరాదని తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎస్సై కమలాకర్‌లుతెలిపారు.

దహెగాం: మండలంలోని మొట్లగూడ, రాంపూర్, రావులపల్లి, దిగిడ గ్రామాల్లో పంటలు వందలాది ఎకరాల్లో నీట మునిగాయి. బ్యాక్‌వాటర్ కారణంగా బ్యాక్‌వాటర్ పంట చేనులో నిలిచి పంటలు నష్ట పోతామని రైతులు ఆవేదన చెందుతు న్నారు. అదే విధంగా కుమరం భీం ప్రాజెక్టు గేటు ఎత్తి నీటిని కిందికి వదలడంతో పెద్దవాగులోకి ఉధృతంగా ప్రవహిసోంది.

పెంచికలపేట: మండల వ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి ఎడ తెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. దీంతో బొక్కివాగు, ఉచ్చమల్లవాగు, గొల్లగూడ వాగులు పొంగి పారుతున్నాయి. కొండపల్లి- గొల్లగూడ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంతెన కొట్టుకు పోయింది. మరో వైపు ప్రాణహిత నది ఉప్పొంగడంతో తీర ప్రాంత గ్రామాలైన జిల్లెడ, మురళీగూడ, కమ్మర్‌గాం, నందిగాం గ్రామాల్లో పత్తి పంటలో నీరు చేరింది.

కాగజ్‌నగర్: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కాగజ్‌నగర్ పట్టణం సమీపంలోని పెద్దవాగుకు వరద ఉధృతి పెరిగింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

కోటపల్లి: మండలానికి ఆనుకుని ప్రవహిస్తున్న ప్రాణహిత నది ప్రవాహం ఉధృతంగా ఉన్నందున నది పరివాహకప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎస్ఐ రాజేందర్‌ల సూచించారు. అన్నారం, అర్జునగుట్ట నది పరివాహక ప్రాంతాల్లోని వరద ప్రవాహాన్ని పరిశీలించారు.

నిలిచిన రాకపోకలు



చింతలమానేపల్లిలో వంతెనపై నుంచి ప్రవహిస్తున్న దిందా వాగు

చింతలమానేపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి దిందా-కేతిని గ్రామాల మధ్య ఉన్నవాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచి పోయాయి. ఏటా వర్షాకాలం ఇదే పరిస్థితి దాపురిస్తోంది. లోలెవల్ వంతెన హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలని తాము ఎన్నో పోరాటాలు చేసినా ఫలితం లేకుండా పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా వాగులో నుంచి ఎట్టి పరిస్థితుల్లో దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.



అప్పపెల్లిలో మోటార్‌సైకిల్‌ను పట్టుకుని వాగు దాటుతున్న గ్రామస్థులు

వేమనపల్లి: కల్లెంపల్లి, సుంపుటం, జాజులపేట, వేమనపల్లి, కేతనపల్లి, ముల్కలపేట తదితర గ్రామాల శివారులోని వందలాది ఎకరాల్లో పత్తి పంట నది బ్యాక్ వాటర్‌తో నీట మునిగింది. ప్రాణహి త నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చేపలు పట్టేవారు నదిలోకి వెళ్లవద్దని తహసీల్దార్ సంధ్యారాణి, ఎస్ఐ శ్యామ్‌పటేల్ హెచ్చరించారు. వేమనపల్లి నుంచి మహారాష్ట్రకు నాటు పడవల ద్వారా వెళ్లకూడాదని హెచ్చరించారు.



కాగజ్‌నగర్‌లో ఉధృతంగా ప్రహిస్తున్న పెద్దవాగు

మూడు నెలలు మృత్యువుతో పోరాటం

- గాయపడిన యువకుడి మృతి



సుదర్శన్(ఫైల్)

లక్షెట్టిపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన ఆసం సుదర్శన్ (34) మూడు నెలలు మృత్యువుతో పోరాడి బుధవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలం వెంకట్రావు పేట గ్రామానికి చెందిన ఆసం సుదర్శన్ ఏప్రిల్ 16వ తేదీన తన ఎలక్రిక్ బైక్‌పై లక్షెట్టిపేటకు వస్తుండగా గంపలపల్లి రహదారిపై ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రి తరలించి ప్రథమచికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చేతిలో ఉన్న కొంత డబ్బు, ఉన్న బంగారం అమ్మి వైద్యం చేయించారు. అవికూడా సరిపోకపోవడంతో తెచ్చిన కాడికి అప్పులు కూడా చేశారు. స్నేహితులు బంధువులు చందాల రూపంలో వసూలు చేశారు. వైద్యం కోసం 20లక్షల రూపాయలు ఖర్చు పెట్టినా సుదర్శన్ ప్రాణం దక్కలేదు. సుమారు మూడు నెలలు కోమాలో ఉన్న సుదర్శన్ బుధవారం రాత్రి మరణించినట్లు వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. మౌనిక ఫిర్యాదు మేరకు ఎస్సై సురేష్ ప్రమాదానికి కారణం అయిన ద్విచక్రవాహనదారుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్, సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు మంత్రి కలెక్టర్ వెంకటేష్ దోత్రేతో ఫోన్‌లో మాట్లాడారు. బెజ్జూరు, పెంచికలపేట, దహెగాం మండలాల ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.

- భారీ వర్షాల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. టెలి కాన్ఫరెన్స్ ద్వారా గురువారం అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, మండల అధికారులు, ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, వ్యవసాయ, పోలీస్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమీక్ష నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఎస్పీ కాంతిలాల్ సుభాష్ మాట్లాడుతూ ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీల్లో విపత్తు రక్షణ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. పోలీస్, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అధికారులు జిల్లా అభివృద్ధికి పాటుపడాలి

ఆసిఫాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పాటుపడాలని ఎంపీ గెడం నగేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయం పర్యవేక్షణ కమిటీ, జిల్లా స్థాయి దిశ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 973 అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయని 137 అంగన్‌వాడీ టీచర్ల ఖాళీలు, 357 ఆయాల ఖాళీలు ఉన్నాయని ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టిక ఆహారం అందిస్తున్నామని జిల్లా సంక్షేమాధికారి భాస్కర్ వివరించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓలు, సూపర్‌వైజర్‌లు సందర్శించాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకం కింద ప్రతి ఆవాస గ్రామాలలో శుద్ధమైన తాగునీటిని అందించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు కలుషితమైన నీరు తాగి వ్యాధులు బారిన పడకుండా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి నీటిని అందించాలని తెలిపారు. విద్యుత్ శాఖాధికారులు ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం కింద ప్రతి పీవీటీజీ గ్రామాలలో సూర్య ఘర్ పథకంద్వారా విద్యుత్ లేని గృహాలను గుర్తించి విద్యుత్ సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తిర్యాణి మండలం గోవెన గ్రామ పంచాయతీలో విద్యుత్ సరఫరా లేని ఆవాస ప్రాంతాలకు వెంటనే సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన ప్రాంతాలో అదనపు విద్యుత్ స్తంభాలు, తీగలను అమర్చాలని చెప్పారు. ఇందిరా గిరి సౌర జల వికాసం పథకం కింద గిరిజన పోడు పట్టాదారుల భూములలో బోరువెల్స్, బావులు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ పథకం కింద జిల్లాలో 19 రహదారులు, 31 వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకుంటుందన్నారు. అటవీ శాఖ అనుమతుల ప్రక్రి య త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలన్నారు. జాతీయ రహదారుల శాఖ ఆఆధ్వర్యంలో జిల్లాలో జతీయ రహదారికి ఇరువైపులా గ్రామాలలో సర్వీసు రహదారులు, మురుగు కాలువలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి సాయిబాబా ఆలయం నుంచి గుండి అండర్ పాస్ వరకు పనులు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో యూరియా కొరతలు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో భారత్ సంచార్ నిగం లిమిటెడ్ టవర్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసి ప్రతి మారు మూల గ్రామానికి సేవలను అందించాలని తెలిపారు. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో భాగంగా మారు మూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించి జిల్లా కేంద్రానికి అనుసంధానం చేయాలని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీఎంహెచ్‌వో సీతారాం, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేందర్, పంచాయతీ రాజ్ ఈఈ కృష్ణ, డీపీవో భిక్షపతి, మిషన్ భగీరథ ఈఈ సిద్ధిఖీ, జడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ నగేష్‌కు పూల మొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

దిందా వాగులో యువకుడి గల్లంతు

చింతలమానేపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిందా-కేతిని గ్రామాల మధ్య ఉన్న దిందా వాగులో కేతిని గ్రామానికి చెందిన సద్మేక తిరపతి, అమృతల కుమారుడు సుమన్(18) అనే యువకుగు గురువారం గల్లంతు అయ్యాడు. యువకుడి బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమన్ తన ముగ్గురు మిత్రులతో కలిసి నీటి ఉధృతి తక్కువ ఉన్న సమయంలో వాగు అవతలి వైపు ఉన్న చేనుకు వెళ్లాడు. తిరుగి ఇంటికి వెళ్లేందుకు వాగు దాటే క్రమంలో నీటి ఉధృతి ఒక్క సారిగా పెరగడంతో సుమన్ గల్లంతయ్యాడు. తోటి మిత్రులు, గ్రామస్థులకు, బంధువులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్థులు గల్లంతైన యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడడంతో ఆచూకీ లభించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో ఒకరి మృతి

హాజీపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేట గ్రామానికి చెంది న దర్ని రాజేందర్(40) అనే వ్యక్తి పాము కాటుతో గురువారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గుడిపేట లిక్కర్ గోదాంలో హమాలీ పనిచేసే రాజేందర్ ఈనెల 2వ తేదీన రాత్రి సమయంలో గ్రామంలో నడుచుకుంటూ వెళ్తుండగా పాము కాటువేసింది. కుటుంబీకులు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడు రాజేందర్ భార్య పద్మ ఫిర్యాదు మేరకు హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు..


నేడు బీఎల్‌వోలకు శిక్షణ

సిర్పూర్(టి), జూలై 10 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలో శుక్రవారం బీఎల్‌వోలకు రెండో దశ శిక్షణ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ రహీముద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సకాలంలో హాజరు కావాలని సూచించారు.

50 పడకల ఆస్పత్రి మంజూరు చేయాలి

శ్రీరాంపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌కు 50 పడకల ఆస్పత్రి మంజూరు చేయాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా కోరారు. శ్రీరాంపూర్ ఏరియా సందర్శణకు వచ్చిన చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్‌రాజ్ కుమార్‌ను గురువారం వారు కలిసి వినతిపత్రం అందించారు. ముందుగా ఆయనను సన్మానించి, మాట్లాడతూ, అన్ని ఏరియాలలో శ్రీరాంపూర్ పెద్దదని, ఇక్కడ 9 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వారికి సేవలందించేందుకు 50 పడకల ఆస్పత్రి అవసరమన్నారు. నస్పూర్ డిస్పెన్సరీని ఆనుకొని సింగరేణికి చెందిన ఖాళీ స్థలం ఉందని, అందులో నిర్మాణం చేపట్టవచ్చని తెలిపారు. వెంటనే మంజూరు చేయాలని కోరారు. దీనివల్ల కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, రిటైర్డ్ కార్మికులకు వివిధ వైద్య సేవలు అందించవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జీఎం చర్చల కమిటీ ప్రతినిధి బద్రి బుచ్చయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, ఏరియా కార్యదర్శి మూడ సుధాకర్, పిట్ కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి) : ఆర్‌కే 8 డిస్పెన్సరీని 50 పడకల ఆస్పత్రిగా మార్చాలని, అర్హులైన అంతర్గత ఉద్యోగులతో ఫిజియో థెరపిస్ట్, మేల్, ఫిమేల్ నర్స్ పోస్టులు భర్తీ చేయాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి కోరారు. శ్రీరాంపూర్ ఏరియా సందర్శనకు వచ్చిన చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్‌కు ఆయన వినతిపత్రం అందించారు. నిపుణులైన వైద్యులను నియమించాలని, సీటీ స్కాన్, 2డీ ఈకో అందుబాటులో ఉంచాలని కోపారు. క్యాత్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని, అన్ని రకాల వ్యాధులకు ప్రతి నెలా సరిపడ మందులు ఇవ్వాలని, రిఫరల్ విధానంలో సరైన పద్ధతి అమలు చేయాలని, తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్, కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేష్, ఆర్‌కే 7 పిట్ కార్యదర్శి రాజునాయక్ పాల్గొన్నారు.



చీఫ్ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలి

శ్రీరాంపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని సింగరేణి చీఫ్ మెఇకల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్ అన్నారు. శ్రీరాంపూర్, నస్పూర్‌లోని డిస్పెన్సరీలను సందర్శించారు. గురువారం ఆయన ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యులు., వైద్య సిబ్బంది ఎంతో బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు కావాల్సిన మందులు ఎల్లవేళలా అందించాలన్నారు. ఏరియాలో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ యూనిట్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. సంస్థలో పనిచేస్తున్న వారి పీఎంఈ రిపోర్టులను జాగ్రత్తగా భద్రపర్చాలని సూచించారు. నస్పూర్ డిస్పెన్సరీలో ఏర్పాటు చేసిన ఆడియోమెట్రీ పనితీరును ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డిప్యూటీ సీఎంఓ రమేష్‌బాబు, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, డిస్పెన్సరీ పిట్ కార్యదర్శి విజయలక్ష్మి, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కు అందజేత


రెబ్బెన, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో విధులు నిర్వహించి మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగి రామగిరి రాజంకు బెల్లంపల్లి ఏరియా మేనేజర్ ఎం విజయభాస్కర్ రెడ్డి గురువారం ఏక మొత్తం చెక్‌ను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఇన్వాలిడేషన్ అయిన బిల్లు రూ.21.56లక్షలు మంజూరైనట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు జూపాక రాజేష్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహెర, డీవైపీఎం రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మంజూరు చేయించాలి

శ్రీరాంపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగుల కోసం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మంజూరు చేయించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ కోరారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం (ముగ్దుం భవన్) పునఃప్రారంభం సందర్భంగా వచ్చిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గతంలో సీఎండీ ఎన్ బలరాం హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభిస్తామని ప్రకటించారన్నారు. ఆ హామీని నెరవేర్చేలా సీఎండీపై ఒత్తిడి తీసుకురావాలని సాంబశివరావును కోరారు.

ప్రతిభ గల ఉద్యోగులకు గుర్తింపు



శ్రీధర్‌ను సన్మానిస్తున్న డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్

శ్రీరాంపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ గల ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని డీజీఎం(పర్సనల్) ఎస్ అనిల్ కుమార్ అన్నారు. పనిలో ప్రతిభ చూపిన పర్సనల్ విభాగం ఉద్యోగి కె.శ్రీధర్‌ను ఆయన ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల మూసివేసిన ఆర్‌కే 6 ఉద్యోగులను సర్దుబాటు చేయడంలో కె. శ్రీధర్ అత్యంత నైపుణ్యం చూపారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, సీనియర్ పీవో పి కాంతారావు, పర్సనల్ విభాగం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

చెన్నూరు: మండలంలోని అక్కెపల్లి గ్రామంలో ఆదివాసీల ఆరాధ్యదైవం అయిన మాంతమ్మ బోనాల జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు.

బెల్లంపల్లి: మండలంలోని తాళ్లగురిజాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బ్యాగులను పంపిణీ చేశారు.

- బెల్లంపల్లి పట్టణంలోని వార్డుల్లో బ్లీచింగ్, క్లోరినేషన్ చేయించాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయక కార్యదర్శి పసులేటి వెంకటేశ్ కోరారు.

మంచిర్యాల కలెక్టరేట్: ఉత్తరప్రదేశ్‌లో బీసీలు, బలహీనవర్గాలపై అగ్రకుల దురంహకారులు జరుపుతున్న దాడులను అరికట్టాలని బీసీ సంఘాల నాయకులు జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన చేపట్టారు.

- లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలోని చున్నంబట్టీవాడలోని లైన్స్ భవన్‌లో ఈనెల 12న ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో కరపత్రాలను విడుదల చేశారు.

జన్నారం: మండలంలోని గూడ్స్ వాహనదారులు ఆధ్వర్యంలో రోడ్డు మైసమ్మ పూజలు నిర్వహించారు.

లక్షెట్టిపేట: పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మహాధర్నా పోస్టర్లను విడుదల చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ సంఘం జిల్లా అధ్యక్షుడు గూడ వెంకటస్వామి మాట్లాడుతూ 12న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కువద్ద మహాధర్నానిర్వహిస్తామన్నారు.

- లక్షెట్టిపేట పట్టణానికి చెందిన కందుల ఖుషీంద్రవర్మ భారతప్రభుత్వం విడుదల చేసిన నీట్ యుజీ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 59వ ర్యాంక్ సాధించాడు.

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన మంద రాజు, అతడి భార్య అనారోగ్యంతో మృతి చెందగా వారి కూతురికి అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల ద్వారా సేకరించిన 17 వేల రూపాయలను అందించారు.

వామ్మో..వసతి గృహాలు



శిథిలావస్థలో ఉన్న బెల్లంపల్లిలోని వసతి గృహం

- శిథిలావస్థలో కళాశాల, పాఠశాల వసతి గృహాలు
- వర్షాకాలంలో ప్రమాదకరంగా మారుతున్న వైనం
- వానొస్తే స్లాబ్ నుంచి గదుల్లోకి నీరు భయాందోళనలో విద్యార్థులు

బెల్లంపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమై దాదాపు నెల రోజులు కావస్తోంది. చాలా మంది విద్యార్థులు తిరిగి సంక్షేమ హాస్టళ్లలోకి చేరుకున్నారు. కానీ హాస్టళ్లలో మాత్రం వసతులు లేమి విరిగిన కిటికీలు, పలిగిన తలుపులతో పాటు శిథిలావస్థలో ఉన్న గచ్చులు దర్శనమిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఓ వైపు ఇబ్బందులు పడుతుండడంతో పాటు భయాందోళనకు గురవుతున్నారు. వేసవి సెలవుల్లో దాదాపు నెలన్నరపాటు వసతి గృహాలన్ని మూసి ఉన్నాయి. తిరిగి తెరిచేనాటికి వాటిని చక్కదిద్దాల్సిన సంక్షేమశాఖలు ఏ మాత్రం పట్టించుకోకపోవడం సమస్యగా మారింది. ప్రస్తుతం వర్షాకాలం వానలు కురుస్తుండడంతో శిథిలమైన భవనంలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి నెలకొంది.

వానాకాలంలో భయంభయంగా...

బెల్లంపల్లి పట్టణంలోని షెడ్యూల్డ్ కులాల బాలుర కళాశాల వసతి గృహంతో పాటు బాలుర పాఠశాల వసతి గృహాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఈ భవనాలు నిర్మించి 50ఏళ్లు గడిచిపోవడంతో భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. కొంతకాలం నుంచి ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకున్న ఏదో కంటి తుడుపు చర్యలు చేపట్టారే తప్ప శాశ్వతంగా పరిష్కారం చూప లేకపోయారు. పాఠశాల వసతి గృహంలో విద్యార్థులు 70 మందికిపైగా కళాశాల వసతి గృహంలో 50 మందికిపైగా విద్యార్థులు ఉంటున్నారు. ఈ భవనాల్లో మొత్తం గదులు ఉన్నప్పటికీ పూర్తిగా శిథిలం కావడంతో సగం గదులనే వినియోగిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పై కప్పు పెచ్చులు కూలి కిందపడి పోతున్నాయి.

విద్యార్థులు లేని సమయంలో పెచ్చులు ఊడి పడుతుండడంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. అంతేగాకుం డా ధ్వంసమైన తలుపులు, కిటికీలు, బాతురూంలు, విరిగిపోయిన తలుపులు దర్శనమిస్తున్నాయి. ఈ హాస్టల్‌లో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు కూడ లేవు. సంక్షేమశాఖ జిల్లా ఉన్నతస్థాయి అధికారులు వసతి గృహాలను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థి సంఘాల నాయకులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటి డైరెక్టర్ దుర్గప్రసాద్



మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే సమస్యలు పరిష్కరిస్తాం. వసతి గృహాల భవనాలు శిథిలావస్థలో ఉన్న మాట వాస్తవం. ఇటీవల పరిశీలించిన సమయంలో వసతి గృహాల్లోని స్లాబ్‌పై పెచ్చులు ఊడి కిందపడు తున్నాయి. విద్యార్థులను ఇందులోనే కొంత మంచిగా ఉన్న గదుల్లో ఉండాలని సూచిస్తున్నాం. శిథిల భవనాలతో విద్యార్థులు ఎదుర్కొంటున్నట్లు మా దృష్టికి వచ్చింది.


వసతి గృహంలో స్లాబ్ పై పెచ్చులు ఊడి వస్తున్న వర్షపు నీరు


కిటికీలు లేకుండా ఉన్న వసతిగృహం


బాలుర వసతి గృహంలో పెచ్చులు ఊడిన స్లాబ్

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

బెల్లంపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. శిరిడీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బీజేపీ ఆధ్వర్యంలో శిశుమందిర్ పాఠశాల ఉపాధ్యాయులతో పాటు యోగా, నృత్యకళా గురువులను నాయకులు ఘనంగా శాలువాలతో ఘనంగా సన్మానించారు. నాయకులు హేమాజీ, వెంకటక్రిష్ణ, దార కళ్యాణి, రాచర్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


బెల్లంపల్లిలో గురువులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

జన్నారం: స్థానిక సాయిబాబా ఆలయం, హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుపౌర్ణమి విశిష్టత గురించి ఆలయ అర్చకుల గణేష్ శర్మ భక్తులకు వివరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

దండేపల్లి: గురుపౌర్ణమిని పురస్కరించుకుని దత్తసాయి గురుపేరు సేవా ట్రస్టు ఆధ్వర్యంలో దండేపల్లి మండలంలోని గూడెం షిర్డిసాయి బాబా దేవాలయంలో గురువారం వేద మంత్రోచ్చరణల మధ్య గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. సాయిబాబా పల్లకిసేవ నిర్వహించారు.

మందమర్రిటౌన్: స్థానిక సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సింగరేణి పాఠశాల మైదానంలో యోగా గురువులు పెట్రోలు బంక్ రమేష్, ముల్కల శంకర్, మద్ది శంకర్, బర్ల సదానందంను యోగా సభ్యులు ఘనంగా సన్మానించారు. డ్యాన్స్ మాస్టర్ ఉప్పులేటి నరేష్, శంకర్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ తదితరులు సన్మానించారు..


మందమర్రిలో పూజలు చేస్తున్న భక్తులు

తాండూర్: మండలంలోని అచ్చలాపూర్ వేద పాఠశాల గురువులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. నాయకులు ఏమాజీ, సుధీర్‌గౌడ్, వెంకటకృష్ణ, దుర్గం అశోక్, పులుగం తిరుపతి, విజయ్, సంతోష్, ప్రదీప్, రవి, శ్రీనివాస్, దుర్గచరణ్, విగ్నేష్, సతీష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను విజయవంతం చేయండి

జన్నారం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో జాబ్‌మేళా కార్యక్రమాన్ని ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని దీనిని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల నాయకుడు రాజారాం రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ జాన్సన్ నాయక్ మండల నియోజకవర్గ యువతకు ఉపాధి కల్పించాలన్న సదుద్దేశంతో జాబ్‌మేళా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జాబ్ మేళాలో ఉన్నత స్థాయి శ్రేణి కంపెనీలు పాల్గొంటాయని అన్నారు. దీనిని యువత సద్వినియోగం చేసుకొని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ జాబ్ మేళాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనార్దన్, బాల సాని శ్రీనివాస్‌గౌడ్, సిటిమల భరత్‌కుమార్, రాజు నాయక్, ఎల్లయ్య, ఫజల్‌ఖాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వలస వస్తున్న పులులు..

(5వ పేజీ తరువాయి)

ఆవుల మందపై దాడి చేసి లేగదూడను హతమార్చింది. దీంతో అటవీశివారు ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ పులినైన మంచిర్యాల జిల్లాలో స్థిరంగా ఉండేందుకు అటవీశాఖ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పులుల సంరక్షణతో పాటు నీటి వసతి, శాకాహార జంతువుల సంఖ్య పెరగడం అనుకూలమైన పచ్చగడ్డి, ప్రశాంత వాతవరణం పెద్ద పులుల ఆవాసానికి కలిసి వచ్చే అంశాలే. ఈసారి వచ్చిన పెద్ద పులులు మంచిర్యాల జిల్లాలోనే స్థిరంగా ఉంటాయని అటవీశాక అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● బాధితులకు 24గంటల్లోనే నష్టపరిహారం...

పెద్దపులి దాడిలో మృతి చెందిన పశువుల యజమానులకు అటవీశాఖ అధికారులు 24గంటల్లోనే నష్టపరిహారాన్ని ఇచ్చి రైతులను ఆదుకుంటున్నారు. పెద్దపులల వల్ల నష్టపోయిన రైతు పులికి హాని తలపెట్టే అవకాశం ఉంది. కాబట్టి సంఘటన సంఘటన జరిగిన 24 గంటల్లోనే బాధిత రైతులకు న ష్టపరిహారం ఇచ్చి అన్ని విధాలుగా ఆదుకుంటున్నారు. గడిచిన రెండేండ్లలో జిల్లాలో 22 పశువులు పెద్దపులుల దాడిలో మృతి చెందాయి. బాధిత కుటుంబాలకు అటవీశాఖ అధికారులు రెండు లక్షల 51వేల నష్టపరిహారం అందించారు. వన్యప్రాణుల దాడులతో పంటనష్టం, ఎలాంటి నష్టం జరిగినా సమీప అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని, వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టవద్దని అటవీశాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రజలు అప్రమత్తతోనే వన్యప్రాణుల నుంచి కాపాడుకోవాలని హాని తలపెట్టవద్దని సూచిస్తున్నారు.

17న ఆసరా పింఛన్‌దారుల సదస్సు

నస్పూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 17న ఆసరా పింఛన్‌దారుల సదస్సు నిర్వహిస్తామని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ, జిల్లా కన్వీనర్ బీవీ అప్పరావు ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగులకు ఆరు వేల రూపాయలు, వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు నాలుగు వేల రూపాయల పింఛన్ వెంటనే ఇవ్వాలనే డిమాండ్‌తో సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన పెన్షన్‌దారులు పెద్ద సంఖ్యలో సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

సికిల్‌సెల్ పరీక్షలు చేయించుకోవాలి

జన్నారం,జూలై10(ఆంధ్రజ్యోతి): గిరిజనులందరూ సికిల్‌సెల్ పరీక్ష చేయించుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్ సూచించారు. గురువారం మండలంలోని కవ్వాల్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సికిల్‌సెల్ ఎనిమియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థినులతో పాటు ఉపాధ్యాయులు రమేశ్‌చందర్, రాంబాబు, మౌనిక, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆషాఢమాస పౌర్ణమి జాతర

దండేపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాస గురు పౌర్ణమిని పురస్కరించుకుని దండేపల్లి సత్యనారాయణస్వామి దేవస్థానంలో గురువారం పౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్బంగా వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కుటుంబ సమేతంగా సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం కుటుంబ సమేతంగా సామూహిక వ్రతాలను ఆచరించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తుల కోసం తాగునీటితో పాటు అన్నదానం ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సంకటాల శ్రీనివాస్ వెల్లడించారు.

గోరింటాకు సంబురాలు


గోరింటాకు వేడుకల్లో పాల్గొన్న మహిళలు

దండేపల్లి జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్యవైశ్య మహిళలు గోరింటాకు సంబరాలను గురువారం నిర్వహించారు. మాల్లారి వినోద్-స్వప్న దంపతుల ఇంటిలో స్థానిక ఆర్యవైశ్య మహిళల సమక్ష్యంలో ఆర్యవైశ్య మహిళలందరు గౌరీ పూజ చేసి, మణిద్వీప వర్ణనపారాయణంతో పూజలను నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు గోరింటాలను అలకరించుకున్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో కార్మికుడు

తాండూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆటోలో మహిళ పర్సు మర్చిపోగా ఆటోడ్రైవర్ పర్సును అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు. బుధవారం తాండూర్ బస్టాండ్ నుంచి బెల్లంపల్లికి ప్రయాణించే క్రమంలో సూరమ్మ అనే మహిళ ప్రయాణికురాలు తన పర్సును భీమేష్ ఆటోలో మర్చిపోయింది. గమనించిన ఆటో డ్రైవర్ భీమేష్ పర్సులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా గురువారం ఉదయం ఆమెకు ఫోన్ చేసి పర్సును అందులో ఉన్న డబ్బులను తాండూర్ బస్టాండ్ అడ్డా వద్ద అధ్యక్షుడు డోలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళకు అప్పగించాడు. నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్‌ను మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు మహ్మద్ హబీబ్ భాషా అభినందించారు.

బీసీ కార్పొరేషన్ రుణాలను విడుదల చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమతి నాయకులు డిమాండ్‌చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నల్లరిబ్బన్‌లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ రుణాలు విడుదల చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా రుణాలు విడుదల చేయడం లేదని దీంతో నిరుద్యోగ బీసీ యువత ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా బీసీ రుణాలను వెంటనే విడుదల చేయాలన్నారు. లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గుమ్ముల శ్రీనివాస్, గజెల్లి వెంకటయ్య, భీంసేన్, భిక్షపతి, చంద్రమౌళి, రాజేశం, లక్ష్మీనరాయణ, సతీష్, సల్మాన్ పాల్గొన్నారు.

'బుద్ధుడితో నా ప్రయాణం' పోస్టర్ల విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ ఆర్ట్ అకాడమీ వారి ఆధ్వర్యంలో ప్రదర్శించనున్న బుద్ధుడితో నా ప్రయాణం నాటకం పోస్టర్లను కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న సాయంత్రం ఆరు గంటలకు జిల్లా కేంద్రంలోని మ్యాక్స్ భవనంలోని శుభం కన్వెన్షన్ హాలులో నాటకం ప్రదర్శనలకు ప్రజలు, బౌద్ధవాదులు, మేధావులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాటకం నిర్వహకులు శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు'

భీమారం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్లలో భారీగా అక్రమాలు జరిగాయని అర్హులైన వారికి రాలేదని, అనర్హులకే ఇళ్లు వచ్చాయని అభయ్ రామన్ సొసైటీ అధ్యక్షుడు భూపెల్లి లక్ష్మణ్ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇష్టారీతిగా ఇళ్లను కేటాయించుకున్నారని అధికారులు క్షేత్రస్థాయిలో మరోమారు సర్వే చేయించి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. సర్వే చేయడానికి ఎన్‌జీవోలకు అప్పజెప్పాలన్నారు. మండలంలో ఎంతో మంది డేరాల్లో, రేకుల ఇళ్లలో ఉంటున్నారని, వారికి ఇళ్లు రాలేదని అనర్హులకే వచ్చాయని తెలిపారు. ఇప్పటికైనా మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులకు ఇళ్లు కేటాయించాలని కోరారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

భీమారం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆరేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం తెల్లవారుజామున 30 లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు భీమారం ఎస్‌ఐ శ్వేత తెలిపారు. ఎస్ తెలిపిన వివరాల ప్రకారం ఆరేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద తనిఖీలు చేస్తుండగా ఒక వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని ఆపకుండా పారిపోతుండగా అతన్ని వెంబడించి జోడువాగుల వద్ద పట్టుకున్నామన్నారు. అతని వద్ద ఉన్న డబ్బాలో తనిఖీ చేయగా గుడుంబా ఉందన్నారు. కొత్తూరు నుంచి కోటపల్లికి గుడుంబా తరలిస్తున్నట్లు నిందితుడు లంబాడితండాకు చెందిన ధరావత్ శంకర్ ఒప్పుకున్నాడన్నారు. గుడుంబా, బైక్‌ను సీజ్ చేసి శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా గుడుంబా తరలించినా, విక్రయించినా, తయారు చేసిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

దరఖాస్తులు ఆహ్వానం


కోటపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్ బైపీసీ విభాగంలో అడ్మిషన్లు పొందే విద్యార్థినులు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేకాధికారి హరిత ఒక ప్రకటనలో కోరారు. గత సంవత్సరం జాయిన్ కాకుండా డ్రాపౌట్‌గా ఉన్న వారు సైతం ప్రవేశం పొందవచ్చని తెలిపారు.

ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులోని గోదావరి వద్ద ఇసుక రీచ్‌ను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాల నాయకులు దుంపల రంజిత్‌కుమార్, సంకె రవి పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చెన్నూరులోని గోదావరి వద్ద ఇసుక రీచ్‌ను ఏర్పాటుచేయాలని ట్రాక్టర్ ఓనర్లు, డ్రైవర్లు చేస్తున్న సమ్మెకు తమ మద్దతు తెలుపుతున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం, కలెక్టర్ స్పందించి చెన్నూరులో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు కనికరపు అశోక్, ఎర్మ పున్నం, ప్రకాష్ పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన లారీ: డ్రైవర్‌కు గాయాలు

జైపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుమట్ల ఎక్స్‌రోడ్డు వద్ద లారీ చెట్టును ఢీకొనడంతో డ్రైవర్ నిరాజ్ కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి అమెజాన్ పార్సిల్స్‌తో మంచిర్యాలకు వస్తున్న లారీ గురువారం ఉదయం టేకుమట్ల ఎక్స్‌రోడ్డు వద్దకు రాగానే అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈలారీ హైదరాబాద్‌కు చెందిన రాళ్లబండి రామనందం అనే వ్యక్తికి చెందినదిగా గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


నుజ్జునుజ్జయిన లారీ

ఇసుక డంప్‌లు సీజ్

జన్నారం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాదంపల్లి గ్రామంలో నిల్వ ఉంచిన తొమ్మిది ఇసుక డంప్‌లను అధికారులు గురువారం సీజ్ చేశారు. పక్కా సమాచారం మేరకు ఆర్ఐ భానుచందర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సహకారంతో డంప్‌లను సీజ్ చేశారు. ఈ డంప్‌ల్లో సుమారు 168 ట్రాక్టర్ల ఇసుక ఉంటుందన్నారు ఎవరైన అక్రమంగా ఇసుక తరలించిన, నిల్వ చేసిన కేసులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

శుభ్రమైన నీటిని సరఫరా చేయాలి

జైపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో క్లోరినేషన్ చేసిన శుభ్రమైన నీటిని మాత్రమే సరఫరా చేయాలని ఎంపీవో శ్రీపతి బాపురావు సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని ఎల్కంటి, టేకుమట్ల, ఇందారం గ్రామపంచాయతీలను సందర్శించారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించి తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని సూచించారు. గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. నర్సరీల్లోని మొక్కలను హోమ్‌షెడ్ ప్లాంటేషన్ కింద ప్రజలకు పంపిణీ చేశారు. సెగ్రిగేషన్ షెడ్డులో కంపోస్టు ఎరువులను తయారు చేయాలన్నారు. శ్మశాన వాటికలో పిచ్చిమొక్కలు లేకుండా చూడాలన్నారు. వనమహోత్సవాన్ని ముమ్మరంగా నిర్వహించాలన్నారు. తాగునీటి వాటర్ ట్యాంకులను పరిశీలించి వారానికి ఒకసారి క్లోరినేషన్ చేయించాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి రికార్డులను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కార్యదర్శులు సుమన్, శ్రీనివాస్, శ్రావణి ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీవో బాపురావు

యాదగిరి శేఖర్‌రావుకు గౌరవ డాక్టరేట్

జన్నారం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ప్రైవేటు పాఠశాలల తరుపున చేస్తున్న సేవలకు మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన యాదగిరి శేఖర్‌రావుకు గురువారం హైదరాబాద్‌లోని హోప్ థియోలాజికల్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. యాదగిరి శేఖర్‌రావు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం సంఘం(ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ విద్యారంగంలో పలు సేవలు అందించారు. మండలవాసులు హర్షం వ్యక్తం చేశారు.



డాక్టరేట్ అందుకుంటున్న శేఖర్‌రావు, విష్ణువర్ధన్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్/హాజీపూర్: మంచిర్యాలకు చెందిన ప్రముఖ విద్యావేత్త రాపోలు విష్ణువర్ధన్‌రావుకు హోప్ థియోలాజికల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ట్రస్మా సభ్యులు, ఉపాధ్యాయులు, అభినందనలు తెలిపారు.

15న మెగా ఫార్మా జాబ్‌మేళా

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 15న జిల్లా కేంద్రంలోని గర్మిళ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా ఫార్మా జాబ్‌మేళా నిర్వహిస్తామని ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ కెమెస్ట్రీ, ఇంటర్ బైపీసీ, ఎంపీసీ, ఎంఎల్‌టీ కోర్సులు చేసిన వారు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 8142194787, 6303204295లో సంప్రదించాలన్నారు.

బొక్కలగుట్టలో గిరి ప్రదక్షిణ

మందమర్రిరూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొక్కలగుట్టలోని దృశ్యముఖ బాలాజీ ఆలయంలో గురువారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు అందుగుల శ్రీనివాస్, నాయకులు అక్కల రమేష్, వికాస తరంగిణి గౌరవాధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, కరెస్పాండెంట్ హన్మంతరావు, ఆలయ కమిటీ సభ్యులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యార్థులకు వైద్య పరీక్షలు

నస్పూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణపై సూచనలు, సలహాలను ఇచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ఆఫీసర్ పద్మశ్రీ, కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపల్ మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి పై కళాజాతా

హాజీపూర్, జులై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంనూర్ గ్రామంలో ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమనాన్ని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల బృదం ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న వడ్డీ లేని రుణాలను మహిళా సాధికార బృందం ఆధ్వర్యంలో ఆట పాట కార్యక్రమం నిర్వహించారు. మహిళలంతా ఆర్థిక అభివృద్ధి సాధించాలని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందించి ఆర్థికంగా ప్రోత్సహిస్తుందని కళాకారులు ఆటపాటల ద్వారా వివరించారు. ఈకార్యక్రమంలో కళాజాత టీం లీడర్ ముల్కల్ల మురళి, లచ్చన్న, పోశం, సురేందర్, శ్రీనివాస్, కృష్ణ, సంతోష్, నిరోష, ఐకేపి సీఏలు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న కళాకారులు


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంచిర్యాల జిల్లా వార్తలు

5

శుక్రవారం 11 జూలై 2025



అటవీ సంపదకు నష్టం కలిగిస్తే చర్యలు

వేమనపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అటవీ సంపదకు నష్టం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కోటపల్లి డిప్యూటి రేంజర్ పాషా అన్నారు. గురువారం ముల్కలపేట గ్రామంలో పట్టుపురుగుల పెంపకం దారులతో సమావేశం నిర్వహించారు. ప్రాణహిత వన్యప్రాణి అభయారణ్యం పరిధిలో పట్టు పురుగుల పెంపకం నిషేధం అని, పట్టుపురుగుల పెంపకం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. అటవీ సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో బీట్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉప్పొంగుతున్న ప్రాణహిత

6

● నీటిలో మునిగిన పత్తి పంట

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తోడు మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో వేమనపల్లి సరిహద్దున ప్రవహిస్తున్న ప్రాణహిత నది గురువారం ఉగ్రరూపం దాల్చింది. మండలంలోని పలు గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పత్తి పంట నది బ్యాక్ వాటర్‌తో నీట మునిగింది. వేమనపల్లి నుంచి సుంపుటం రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. ముల్కలపేట నుంచి రాచర్లకు వెళ్లే మార్గంలో బొందచేను ఒర్రె వద్ద నది బ్యాక్ వాటర్ రావడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు.



వేమనపల్లి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత నది

ప్రమాదాలకు నిలయంగా పాలచెట్టు రోడ్డు

మందమర్రిటౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాల చెట్టు ఏరియాలోని కోల్‌బెల్ట్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డు అంటేనే వాహనదారులు భయపడుతున్నారు. రోడ్డుపై నిత్యం వందల లారీలు, వేలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు ప్రయాణిస్తుంటాయి. ఆయా గనుల నుంచి లారీలు బొగ్గు రవాణా చేస్తుంటాయి.ఈ రోడ్డుపై నుంచి నిత్యం నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు, గృహాలు ఉన్నాయి. డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లు, దుకాణాల నుంచి నీరు రోడ్డుపైకి వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. సింగరేణి యాజమాన్యం రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిని నియంత్రించాలని, డ్రైనేజీలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



పాలచెట్టు రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

వలస వస్తున్న పులులు ..



మంచిర్యాల డివిజన్‌లో తిరుగుతున్న ఎస్12 పెద్దపులి

బెల్లంపల్లి డివిజన్‌లో తిరుగుతున్న బీ1 పెద్దపులి

● రెండేళ్లలో నాలుగు పులులు రాక

● అడవికి కొత్త అందాలు

● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రకృతి ప్రేమికులు

కాసిపేట, జూలై 10(ఆంధ్రజ్యోతి): అడవులకు పులుల రాకతో కొత్త అందాలను సంతరించుకుంటున్నాయి. గడిచిన రెండేళ్లలో మంచిర్యాల, బెల్లంపల్లి అటవీ డివిజన్‌లోకి మహారాష్ట్ర నుంచి నాలుగు పెద్దపులులు వలస వచ్చాయి. అతిథులుగా వచ్చి వెళ్తున్నాయి. కాని సరైన అవాసాలు లేక స్థిరంగా ఉండడం లేదు. పులుల వలసలో అడవిలోని హాబిటేషన్లు గణనీయంగా పెరిగాయి. అడవిలో పరుచుకున్న పచ్చదనం ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పులులు ఊరు శివారు ప్రాంతంలోకి వచ్చినప్పటికీ ఆవుల మందలపై దాడులు చేసిన ఘటనలు ఉన్నాయి. కాని అవి ఎక్కడ కూడా మనుషులపై దాడి చేయకపోవడం విశేషం.

అతిథులుగా పెద్ద పులులు..

మంచిర్యాల జిల్లాలో 1,76,699.21 హెక్టార్లలో అడవి విస్తరించంది. కవ్వాల్ టైగర్ జోన్‌లోకి వలస రాని పులులు మంచిర్యాల, బెల్లంపల్లి అటవీ డివిజన్‌లోని రావడంతో అటవీశాక అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది జనవరి 31 నుంచి రెండు నెలల పాటు బీ1 పెద్దపులి మంచిర్యాల డివిజన్‌లో సంచరిస్తూ భూపాలపల్లి అటవీడివిజన్‌లోకి వెళ్లింది. అలాగే ఎస్12 పెద్దపులి కూడా గత ఏడాది అక్టోబరులో బెల్లంపల్లి, మంచిర్యాల అటవీ డివిజన్‌లో మూడు నెలలు నివాసం ఉంది. ఎట్టకేలకు ఎస్12 పెద్దపులి వేములవాడ అటవీ డివిజన్ పరిధిలోకి సురక్షితంగా చేరుకుంది. ఆరు నెలలుగా లక్కెట్టిపేట రేంజ్ పరిధిలో స్థిర నివాసం ఏర్పరుచుకున్న ఎల్1 పెద్దపులిమాత్రం తన ఆవాసాన్ని సురక్షితం చేసుకొని స్థిరంగా ఉంది. ఇప్పుడు బెల్లంపల్లి, మంచిర్యాల అటవీ డివిజన్లతో పాటు కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని అటవీరేంజ్ పరిధిలో వారం రోజులుగా పెద్దపులి సంచరిస్తూ హడలెత్తిస్తోంది. గత సోమవారం ముత్యంపల్లి అటవీసెక్షన్ పరిధిలోని వెంకటాపూర్ అటవీశివారులో..

మిగతా 7లో

గుడుంబా రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి



ముల్కలపేటలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్యామ్ పటేల్

నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్

వేమనపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గుడుంబా రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందని నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముల్కలపేట గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 30 ద్విచక్రవాహనాలను, నంబరు ప్లేట్‌లేని ఓ బైక్‌ను సీజ్ చేశారు. గ్రామంలో గుడుంబా తయారు చేస్తున్న మధునక్క గుడుంబా బట్టిని ధ్వంసం చేసి వంద లీటర్ల పానకం ధ్వంసం చేశారు. నాలుగు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గుడుంబాను రూపుమాపేందుకు గ్రామాల్లోని యువకులు సహకరించాలన్నారు. మండలానికి ఇటీవల గుడుంబా తరలిస్తున్న ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. గుడుంబా రవాణాదారులు కొత్తకొత్త పద్ధతుల్లో గ్రామాలకు గుడుంబా తరలిస్తున్నారన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానా స్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గుడుంబా తాగడం వల్ల అనారోగ్యం బారిన పడతారని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా, ఏటీఎం, ఓటీపీ నంబర్లు చెప్పవద్దన్నారు. వాహనాలకు సంబంధించి అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎస్ ఎస్పీ, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి



చెన్నూరులో నాటిన మొక్కలకు నీరు పోస్తున్న జడ్జి రవి

చెన్నూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు మొక్కలునాటి వాటిని సంరక్షించాలని చెన్నూరు జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి పర్వతనేని రవి సూచించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వనమహోత్సవంలో పాల్గొని చెన్నూరులోని కోర్టు ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలునాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మానుగడ సాధ్యమవుతుందన్నారు. స్వచ్ఛమైన గాలి మనకు అందాలంటే మొక్కలునాటి సంరక్షించాలని సూచించారు. నాటిన మొక్కలను కాపాడే ప్రతి ఒక్కరిపై ఉందని, మొక్కలు ఎండి పోకుండా ప్రతి రోజు వాటికి నీరు పోయాలన్నారు. వనమహోత్సవంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

వర్షపునీటిని ఒడిసి పట్టాలి

నెన్నెల, జులై 10 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమిలో ఇంకేలా కృషి చేస్తే భావితరాలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని కేంద్ర జలశక్తిశాఖ భూగర్భ జల శాస్త్రవేత్త కొల్లి రాంబాబు అన్నారు. జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులను పరిశీలించేందుకు కేంద్ర బృందం గురువారం మండలంలో పర్యటించింది. ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ సోక్‌పిట్స్, ఫారంపాండ్, ఊటకుంటలను బృందం సభ్యులు పరిశీలించారు. డీఆర్‌డీఏ నోడల్ ఆఫీసర్ సదానందం, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్, ఉపాధిహామీ టెక్నికల్ సభ్యులు సత్యనారాయణ, మధు, ఇన్‌చార్జి ఎంపీడీవో వీణా, ఏపీవో నరేష్, ఈసీ స్వామి తదితరులు ఉన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ప్రభుత్వం చేపట్టిన అందుబాటులో ప్రజా ప్రతినిధులు అనే కార్యక్రమంలో హాజరై ప్రజా ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేలతో అందుబాటులో ప్రజాప్రతినిధులు కార్యక్రమం తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా ప్రజా ప్రతినిధులను కలిసే అవకాశం ఏర్పడిందని ఎమ్మెల్యే వినోద్ తెలిపారు.

బీఎల్‌వోలు సమర్ధవంతంగా విధులు నిర్వహించాలి

భీమిని, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌వో కీలక పాత్ర కీలకమని సమర్థవంతంగా విధులు నిర్వహించాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశలలో భీమిని, కన్నెపల్లి బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాటాడారు. బీఎల్‌వోల విధులు, బాధ్యతలపై వివరాలు తెలియజేశారు. బీఎల్‌వోలుగా నియమితులైన వారు ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణల ప్రక్రియను నిబంధనల మేరకు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఓటర్ల అభ్యర్థనను సమీక్షించి డోర్‌టూ డోర్ పద్ధతిలో వివరాలను సేకరించాలని సూచించారు. వయస్సు, చిరునామా ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనంతరం వారికి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో శిక్షకులు, భీమిని ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామి, తహసీల్దార్ బికర్ణదాస్, సీనియర్ అసిస్టెంట్ దాగాం కొండయ్య, ఆర్ఐ వెంకటేష్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,బేరం క్యా పార్క్, జనరల్4/1,TTC, ఠానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదీన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో దేనినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం తేది: 19-07-2025, వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం.5-7-100/5, 1 వ అంతస్తు,అప్పలనర్సయ్య కాంప్లెక్స్, నిర్మల్ - 504106

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
NIRMLPJ2501040017	MOHAMMAD JAHEER	NIRMLPJ2501180017	CHINNA LAXMI KORRI
NIRMLPJ2501070015	SHAMSODH SYED	NIRMLPJ2501180007	RESHMA BEGUM
NIRMLPJ2501070005	RIZWANA BEGUM	NIRMLPJ2410180003	CHITTI UMA
NIRMLPJ2501080009	RYAPANI BABU	NIRMLPJ2501270015	KUNA LAXMI
NIRMLPJ2501090017	KANCHU SHYAMALA	NIRMLPJ2501270007	GANGADHER PASULA
NIRMLPJ2501150005	RYAPANI BABU	NIRMLPJ2501280007	VALLAMPATLA RANJEETH KUMAR
NIRMLPJ2501170013	ANWAR UDDIN		
NIRMLPJ2501180022	SURESH NAKIDI	NIRMLPJ2501300001	BHEEMDAS JANGILI

వేలం తేది: 19-07-2025, వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం. 3-1-92/18, 1 వ అంతస్తు,నిజామాబాద్ రోడ్,ఆర్మూర్ జిల్లా,నిజామాబాద్-503224,తెలంగాణ

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
ARMOOPJ2501070002	YEDLA SUGUNA	BHGALPJ2501240004	PALLAPU RAMACHANDRAIAH
BHGALPJ2501100004	KARROLLA CHANDRA	BHGALPJ2501240005	PALLAPU RAMACHANDRAIAH
BHGALPJ2501180004	RAGI NARENDHAR	ARMOOPJ2501260002	MUDA POSHANI
BHGALPJ2501180009	NARABOINA SUMALATHA	ARMOOPJ2501290002	BOMMAGANI BALAIAH
ARMOOPJ2501220001	KUDUKALA SRUJAN KUMAR	BHGALPJ2501290004	KURA VENKATESH

వేలం తేది: 19-07-2025, వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం. 1-5-79/48/1, 1 వ అంతస్తు,మహాలక్ష్మి జ్యూవెలరి మార్కెట్ ఎదురుగా,పాత పోస్టాఫీసు,భైంసా,ఆదిలాబాద్ జిల్లా-503103,

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
ADILDPJ2501250011	SYED IMTIYAZ ALI		

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ యం.అశోక్ కుమార్ సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటి రోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంతో సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 11.07.2025
స్థలం: నిజామాబాద్

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నేర రహిత సమాజ స్థాపనే లక్ష్యం



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఏసీపీ రవికుమార్

● బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

మందమర్రిటౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నేరరహిత సమాజ స్థాపనే లక్ష్యమని, ఇందుకు ప్రజలందరూ సహకరించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం మందమర్రి పట్టణంలోని జాతీయ రహదారిపై డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం కాలినడకన చెంచు కాలనీ, విద్యానగర్ కాలనీల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయించే వారిపై నిఘా ఉంటుందన్నారు. అక్రమంగా మత్తు పదార్థాలు, గంజాయి తరలించినా, విక్రయించినా, సేవించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కళాశాలలు, పాఠశాలల్లో మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఆటో డ్రైవర్లు, ద్విచక్రవాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. అనంతరం పాత బస్టాండ్ నాకాబందీ కార్యక్రమం నిర్వహించి నంబరు ప్లేట్లు లేని, సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు రాజశేఖర్, ప్రవీణ్, ఆంజనేయులు, అదనపు ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

● డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

తాండూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ సూచించారు. గురువారం తాండూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో సందర్శించారు. రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. వైద్య సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్‌ను సందర్శించి మందులు, పరికరాలను తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలను చేయాలని, ప్రసవాల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పాము,కుక్క కాటు మొదలైన వాటి మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రతీగ్రామంలో వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ప్రతి ఆశా కార్యకర్త వద్ద మందులు ఉండాలన్నారు. డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌పోర్టు సరిగ్గా లేని గ్రామాల్లో డెలివరీలకు దగ్గరగా ఉన్న గర్భిణులను తరలించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తాండూర్ ఆరోగ్యకేంద్రంలో వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

వేమనపల్లి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ సూచించారు. గురువారం వేమనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ప్రోగ్రాం ఆఫీసర్ కృపాబాయి, స్థానిక వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

కావలెను

★ మంచిర్యాలలో హాస్పిటల్ నందు పని చేయుటకు ఆయాలు, నర్సులు, కంపౌండర్‌లు, ఎక్స్‌రే టెక్నీషియన్ కావలెను. ఆసక్తి కలవారు సంప్రదించగలరు. సెల్: 7036555577

AJK-238283

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని, ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

మంచిర్యాల :- సెల్: 99854 11038

కాగజ్‌నగర్ :- సెల్ : 99854 08147